"ఇక మీదట మీరు వ్రాసే రచనలన్నీ నా పేరు మీదే పంపాలి" లాంటి షరతుయు విధించినా నేను అందుకు సంసిద్ధమే

కనకమేడల వ్రాసిన 'మహామాయ' ఇరవయి నాలుగు భాగాల కోసం ఎంత ఆతృతగా ఎదురు చూసానో, నీ జవాబు కోసం అంత ఆదుర్దాగా ఎదురు చూస్తున్నాను

మార్చి 31 న వ్రాస్తున్న ఈ వుత్తరం నిన్ను ఏప్రిల్ ఫూల్ చేయడానికి అనుకుని భ్రమపడకు సుమా! ఎల్లుండిదాకా ఆగలేక వ్రాసేస్తున్నాను

ఇది 'ఏప్రిల్ ఫూల్' కథ కాదు. నూటికి నూరుపాళ్ళూ వుత్తరమే

నీ ప్రేమామృతాన్ని కోరే
'బిందు'
(అది నా కలం పేరు భీమారావు)

—మల్లాది వెంకటకృష్ణమూర్తి

---

మరీ మినీ కథ

# సందేహం

"నాన్నా! అదేమిటి?"

"సముద్రం"

"లోతుగా ఉంటుందెంటి?"

"ఉంటుంది"

"నేను మునిగిపోతానేమిటి?"

"మునిగిపోతావు"

"అమ్మ?"

"అమ్మ కూడ"

"నువ్వో?"

"నేను కూడ"

"ఏనుగో?"

"అది కూడ"

"మరి ఏనుగు మీద ఏనుగెక్కితే?"

"అది కూడ మునిగిపోతుంది"

"దానిమీద ఇంకో ఏనుగెక్కితే?"

"అది కూడ మునిగిపోతుంది"

"మరి కిందేనుగు ఏమవుతుంది నాన్నా?"

"చచ్చిపోతుంది"

"మీదేనుగు?"

"అదీ చచ్చిపోతుంది"

"ఒల్లదేమిటి నాన్నా?"

"షిప్"

"చిప్పు అంటే?"

"పడవ"

"అది నీట్లో మునగదా?"

"మునగదు"

"ఎందుకు మునగదు?"

"తేలుతుంది కాబట్టి"

"ఎందుకు తేలుతుంది?"

"మునగదు కాబట్టి"

"ఎందుకు మునగదు?"

"నాకు తెలీదు. మీ అమ్మనడుగు"

"ఛీ! నువ్వెప్పుడూ ఇంతే చెప్పవు అలాగయితే ఏడుస్తాను"

"వద్దు ఏడవకు చెప్తాను అదిగో కెరటాలు చూడు ఎంత బాగున్నాయో!"

"కెరటా లెందుకొస్తాయి నాన్నా?"

"అవీ అవీ సముద్రానికి కోపం వస్తుంది కాబట్టి"

"సముద్రానికి కోపం ఎందుకొస్తుంది?"

"మీ అమ్మ కెందు కొస్తుంది? అదీ అలాగే!"

"అమ్మ కెందుకు కోపం వస్తుంది?"

"నేను పెళ్ళి చేసుకొన్నానని"

"నువ్వెందుకు పెళ్ళి చేసుకొన్నావు?"

"అవును ఎందుకు చేసుకొన్నాను?"

— బి ఎస్ ఎన్ మూర్తి